







# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 259. ఎడిటర్ : సింగిడి అమృత్ తెలంగాణ గురువారం.03.07.2025 పేజీలు:4, వెల:రూ.1.00


## పదో తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి ఇంటర్మీడియట్ పూర్తి చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్: అమృత్ తెలంగాణ: పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా ఇంటర్మీడియట్ పూర్తి చేసేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పదో తరగతిలో పెద్ద సంఖ్యలో ఉత్తీర్ణత కనిపిస్తోందని ఇంటర్మీడియట్ పూర్తయ్యే సరికి ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోవడానికి గల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. విద్యా శాఖపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ దశ కీలకమైనందున.. ఆ దశలో విద్యార్థికి సరైన మార్గదర్శకత్వం లభించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాల్లో 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉంటుందని.. అక్కడ డ్రాపౌట్స్ సంఖ్య తక్కువగా ఉందని అధికారులు సీఎంకు తెలియజేశారు. ఇంటర్మీడియట్ వేరుగా.. 12వ తరగతి వరకు పాఠశాలలు ఉన్న రాష్ట్రాల్లో అధికారులు అధ్యయనం చేసి ఈ విధానంపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ విషయంలో విద్యా కమిషన్, ఆ విభాగంలో పని చేసే ఎన్జీవోలు, పౌర సమాజం సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. ఇంటర్మీడియట్ విద్య మెరుగుకు అన్ని దశల్లో చర్చించి శాసనసభలోనూ చర్చకు పెడతామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇంటర్మీడియట్‌లో విద్యార్థుల చేరికతో పాటు వారి హాజరుపైనా దృష్టిపెట్టాలన్నారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్స్ స్కూళ్ల నమూనాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. ప్రతి పాఠశాల ఆవరణలో భారీ జాతీయ జెండా ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. పాఠశాలల నిర్మాణం ప్రక్రియను వేగవంతం చేయాలని , నిర్మాణాల ప్రగతిపై ప్రతి వారం తనకు నివేదిక సమర్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో బాలురకు ఒకటి, బాలికలకు ఒకటి యంగ్ ఇండియా రెసిడెన్షియల్స్ స్కూళ్ల నిర్మాణాలను చేపడతామన్నారు. ఇప్పటికే ఒక్కో పాఠశాలకు సంబంధించి స్థల సేకరణ పూర్తయినందున, రెండో పాఠశాలకు సంబంధించిన స్థల గుర్తింపు, సేకరణ ప్రక్రియపై దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం నిర్మాణ నమూనాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. పలు మార్పులను సూచించారు. సాధ్యమైనంత త్వరగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిత, జేఎన్టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పాశమైలారం ప్రమాద ఘటనపై కమిటీ ఏర్పాటు..




హైదరాబాద్:అమృత్ తెలంగాణ: పాశమైలారం పేలుడు ఘటనపై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. సిగాచీ ఫ్యాక్టరీలో జరిగిన పేలుడు ఘటనపై విచారణకు నలుగురు నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసింది. ప్రమాదానికి గల కారణాలను గుర్తించి నెల రోజుల్లో రిపోర్ట్ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. నిపుణుల కమిటీ చైర్మన్?గా బి. వెంకటేశ్వర్, సభ్యులుగా ప్రతాప్ కుమార్, సూర్యనారాయణ, సంతోష్?లను ప్రభుత్వం నియమించింది. బి. వెంకటేశ్వర్ నేతృత్వంలోని కమిటీ ప్రమాదానికి గల కారణం ఏంటి..? కంపెనీ అన్ని నిబంధనలు పాటించిందా లేదా అన్న అంశాలపై నిపుణుల కమిటీ విచారణ చేసి ప్రభుత్వానికి రిపోర్ట్ అందజేయనుంది. ఎక్స్ పర్ట్ కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.

## పాశమైలారం ఘటన.. రూ.కోటి పరిహారం ప్రకటించిన సిగాచి




హైదరాబాద్: అమృత్ తెలంగాణ: హైదరాబాద్ శివారులోని పాశమైలారంలో ఉన్న సిగాచీ కెమికల్ ఫ్యాక్టరీలో సంభవించిన ఘోర పేలుడు తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో 40 మంది మరణించారని, మరో 33 మంది గాయపడ్డారని స్వయంగా సిగాచీ పరిశ్రమ ప్రకటించింది. కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ.. మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. దాంతో పాటు అన్ని రకాల బీమా క్లెయిమ్‌లను కూడా చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. గాయపడిన వారికి పూర్తి వైద్య సేవలు అందిస్తూ.. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ ప్రమాదంపై స్టాక్‌మార్కెట్‌కు కూడా లేఖ రాసిన వివేక్ కుమార్, తదుపరి మూడు నెలల పాటు కంపెనీ కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదానికి రియాక్టర్ పేలుడు కారణం కాదని ఆయన స్పష్టం చేశారు. అయితే ప్రభుత్వ దర్యాప్తు నివేదిక కోసం వేచి చూస్తున్నామని పేర్కొన్నారు.

## రాష్ట్రానికి సరిపడేంత యూరియాను కేటాయించాలని కేంద్రానికి లేఖ రాసిన తుమ్మల



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: యూరియా కొరతను అధిగమించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కేంద్ర కెమికల్? అండ్? ఫర్టిలైజర్స్? మంత్రి జగత్? ప్రకాశ్? నడ్డాకు, కేంద్ర మంత్రులు కిషన్? రెడ్డి, బండి సంజయ్?కు లేఖలు రాసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. ఖరీఫ్? సీజన్? ప్రారంభమైనందున రాష్ట్రంలో యూరియా అవసరం అంతకంతకు పెరిగిపోయింది. ఏప్రిల్?, మే, జూన్? నెలలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 5 లక్షల మెట్రిక్? టన్నుల కోటా నిర్దేశించింది. అందులో ఇప్పటివరకు 3.06 లక్షల టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా అయింది. అరకొర సరఫరా కారణంగా రాష్ట్రంలో దాదాపు 1.94 లక్షల మెట్రిక్? టన్నుల యూరియా కొరత ఏర్పడింది. తాజాగా జులై నెలకు నిర్దేశించిన సప్లై ప్లాన్? ప్రకారం రాష్ట్రానికి 1.60 లక్షల మెట్రిక్? టన్నులు రావాలి. అందులో 60 శాతం ఇంపోర్టెడ్? యూరియాను కేటాయించటం ఆందోళన కలిగిస్తోందని రాష్ట్ర ప్రభుత్వం ఈ లేఖలో పేర్కొంది. దిగుమతుల ద్వారా రాష్ట్రానికి రావాల్సిన యూరియా సకాలంలో రాష్ట్రానికి చేరుకునే పరిస్థితి లేదని, ఇప్పటి వరకు ఆ యూరియాను రవాణా చేసేందుకు అవసరమైన నౌకల కేటాయింపు జరగలేదని రాష్ట్ర ప్రభుత్వం ఈ లేఖలో ప్రస్తావించింది.దీంతో ఖరీఫ్? పంటలకు అనువైన సమయంలో యూరియా కొరత రైతులను ఆందోళనకు గురి చేస్తోందని మంత్రి తుమ్మల కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. యూరియా సరఫరాపై వెంటనే కేంద్రం తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జూలై నెలకు కేటాయించిన 0.97 లక్షల మెట్రిక్ టన్నుల ఇంపోర్టెడ్? యూరియాకు నౌకలను కేటాయించాలని కోరారు. నుంచి తెలంగాణకు స్వదేశీ యూరియా సరఫరాను 30,800 టన్నుల నుండి 60,000 టన్నులకు పెంచాలని కోరారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు తలెత్తిన యూరియా లోటును భర్తీ చేయడానికి అదనపు కోటాను కేటాయించాలని కోరారు.

## 2026 మేడారం మహా జాతర తేదీలు ఖరారు..




తాడ్వాయి :అమృత్ తెలంగాణ: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీ గిరిజన జాతర గా పేరుగాంచిన సమ్మక్క సారలమ్మ మహా జాతర 2026 లో జరగబోయే తేదీలను పూజారుల సంఘం ఖరారు చేసింది. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, కార్యదర్శి చందా గోపాల్ రావు నేతృత్వంలో సంఘ సభ్యులు సమావేశమై 2026 జనవరి 28 నుంచి 31 వరకు మహా జాతర జరగబోయే తేదీలను ప్రకటించారు. 2026 జనవరి 28 బుధవారం సాయంత్రం 6 గంటలకు కన్నెపల్లి నుండి సారలమ్మ, ఏటూరు నాగారం మండలం కొండాయి గ్రామం నుండి గోవింద రాజు, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెం (గంగారం) మండలం పూనగల్లు గ్రామం నుండి పగిడిద్ద రాజు లు గద్దెలకు చేరుకుంటారు. 2026 జనవరి 29 గురువారం సాయంత్రం 6 గంటలకు సమ్మక్క వనదేవత చిలకలగుట్ట నుండి ప్రభుత్వ లాంఛనాల ప్రకారం నివాసి సాంప్రదాయ పద్ధతిలో గద్దెకు చేరుకుంటారు. 2026 జనవరి 30 శుక్రవారం భక్తులు తమ మొక్కుబడులను సమర్పించుకుంటారు. 2026 జనవరి 31 శనివారం సాయంత్రం 6 గంటలకు అమ్మవార్లు వనప్రవేశం తో జాతర ముగింపు ఘట్టం పూర్తవుతుందని పూజారులు తెలిపారు. పూజారుల సంఘం చేసిన ప్రకటన ప్రకారం అధికారికంగా జాతర నిర్వహణాధికారులు పరిశీలించి సమీక్షించనున్నారు. మేడారం జాతరకు లక్షలాది భక్తులు దేశం నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా విచ్చేస్తారు. దీంతో ఏర్పాట్ల విషయంలో ముందస్తు ప్రణాళిక ఎంతో కీలకం అవుతుంది.

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం ..




హైదరాబాద్:అమృత్ తెలంగాణ: పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకమే ఇందిరమ్మ ఇండ్లు. ఈ పథకానికి సంబంధించి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కీలక విషయాలు వెల్లడించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణ బిల్లులను ప్రతి సోమవారం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు3 లక్షల ఇండ్లు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ తీసుకొచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ పథకం ఒకటి. రాష్ట్రంలోని అర్హులైన పేద, మధ్యతరగతి ప్రజలకు ఇండ్లను కట్టించి ఇస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు 3 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని మంత్రి పొంగులేటి కీలక విషయాలు వెల్లడించారు. వీటిల్లో 2.37 లక్షల ఇళ్లకు ఇప్పటికే మంజూరు పత్రాలు అందించామన్నారు. మరో 1.23 లక్షల ఇళ్లు నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నట్లు వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ రూ. 5 లక్షలతో ఇళ్లను నిర్మించి ఇవ్వట్లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఒక్కో ఇంటికి 40 టన్నుల ఇసుకను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల ఎంపిక ఈ నెల 23వ తేదీ నాటికి జీహెచ్ఎంసీ మినహా మిగిలిన 95 నియోజకవర్గాలకు గాను 88 అసెంబ్లీ స్థానాల్లో లబ్ధిదారుల ఎంపిక పూర్తయిందని మంత్రి పొంగులేటి తెలిపారు. వికారాబాద్, సిద్దిపేట, సూర్యాపేట, పెద్దపల్లి, భూపాలపల్లి, నారాయణపేట, జోగులాంబ గద్వాల, హనుమకొండ జిల్లాలలో పనితీరు ఇంకా మెరుగుపడాలని ఈ మేరకు అధికారులకు సూచించారు.

## ఉద్యోగులకు తీపికబురేది?



హైదరాబాద్ : ఉద్యోగులకు తీపికబురంటూ ప్రభుత్వం ప్రచారం చేసుకోవటం విడ్డూరంగా ఉందని తెలంగాణ యూనైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షులు భూపాల్ విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ‘ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు’ పరిష్కరించాలంటూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఫసీయుద్దీన్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో ఉందని విమర్శించారు. ఉద్యోగుల పట్ల గత కేసీఆర్ ప్రభుత్వ తోవలోనే రేవంత్ సర్కార్ ప్రయాణిస్తున్నట్టుగా ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే అన్ని సమస్యలు పరిష్కరిస్తామంటూ చెప్పిన కాంగ్రెస్.. 18నెలల నుంచి సమస్యలు పరిష్కరించకుండా ఎందుకు విస్మరిస్తోందని నిలదీశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి కె యాదానాయక్ జులై 9 సార్వత్రిక సమ్మెతోపాటు పలు అంశాలతో కూడిన తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం యాదానాయక్ మాట్లాడుతూ 2023 జులై1 నుంచి రావాల్సిన రెండో పీఆర్సీని 51శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలతో సతమవుతున్న ఉద్యోగులకు ప్రతి ఆరు నెల్లకోసారి ఇవ్వాల్సిన డీఏలను పెండింగ్‌లో పెట్టటమేంటని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు జె వెంకటేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ రెగ్యులర్‌గా ఉద్యోగ నియామకాలు చేపడుతూనే ఆ స్థానంలో ఉండే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను దశల వారీగా తొలగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి


హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మంగళవారంనాడిక్కడి ప్రజాభవన్‌లో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) ఉన్నతాధికారులు, డైరెక్టర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యుత్ సరఫరా ఎక్కడైనా ట్రిప్ అయితే వెంటనే ఆ సమాచారం కంట్రోల్ రూమ్‌కు సమాచారం వచ్చేలా ఫీడర్ ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఎఫ్ఓఎమ్ఎస్)ను త్వరగా అమల్లోకి తేవాలని అధికారులను ఆదేశించారు. డిస్కం పరిధిలోని 6,500 ఫీడర్లలో, 5,500 ఫీడర్లలో ఎఫ్ఓఎమ్ఎస్‌ను అమల్లోకి తెచ్చామనీ, మిగిలిన ఫీడర్లలోనూ ఈ టెక్నాలజీని త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్, వినియోగదారులకు మెరుగైన సేవలు, కార్యాలయంలో ఫైళ్ల పరిష్కారం వేగవంతంగా జరగడం వంటి పలు అంశాల ప్రాతిపదికగా డిస్కంకు ఐఎస్ఓ 9000 సర్టిఫికెట్ రావడం పట్ల అయన సంతోషం వ్యక్తం చేశారు. విద్యుత్ సిబ్బంది కోసం ప్రత్యేక డ్రెస్‌కోడ్‌ను పరిశీలించాలని చెప్పారు. 108 అంబులెన్స్ తరహాలో విద్యుత్ శాఖలో 1912 నంబర్‌కు ఫోన్ చేస్తే ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం ప్రత్యేక వాహనంతో సమస్యలు ఉన్నచోట క్షణాల్లో పరిష్కారాలు చేపడుతున్నారని తెలిపారు.

# విద్యార్థులతో కలిసి భోజనం చేసిన సబ్ కలెక్టర్




తొగుట :అమృత్ తెలంగాణ: కస్తూర్బా పాఠశాలను అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్ సందర్శించారు. బుధవారం మండల కేంద్రంలో గల కస్తూర్బా పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులతో ఇంటరాక్ట్ అయి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి నర్సయ్య, తహసిల్దార్, ఆర్ ఐ అశోక్ రాజ్, పంచాయతీ కార్యదర్శి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# రైలు పట్టాలపై తల.. మొండెం వేరు వేరుగా!




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: హనుమకొండ జిల్లా న్యూ శాయంపేట శివారులో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైంది. మృతుడి వద్ద సెల్‌ఫోన్ గానీ, ఎలాంటి గుర్తింపు పత్రాలు గానీ లభించలేదు. ఈ ఘటనపై జీఆర్పీ వరంగల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. మృతుడి పూర్తి వివరాల కోసం జీఆర్పీ వరంగల్ పోలీసులను సంప్రదించగలరని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# యువతకు పోలీసులు వాలీబాల్ కిట్లు అందజేత




తాడ్వాయి:అమృత్ తెలంగాణ: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మొండాలతోగు గుత్తి కోయ గూడెం యువతకు బుధవారం తాడ్వాయి ఎస్సై ననిగంటి శ్రీకాంత్ రెడ్డి, పస్రా సిఐ గద్ద రవీందర్ తో కలిసి జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేసి వారికి క్రమశిక్షణ విషయాలు విన్నవించి, వాలీబాల్ కిట్లను అందజేశారు. జలగలంచ వద్దు జరుగుతున్న పరిశీలించారు. అనంతరం రోడ్డు ప్రమాదాలు నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మేడారం వెళ్లే రహదారిపై చెట్లు పడితే వెంటనే హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని తొలగించారు. ఈ విధంగా తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి మండల వ్యాప్తంగా చేస్తున్న విస్తృత సేవలు అభినందనీయమని మండల ప్రజలు హర్షిస్తున్నారు

# విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



కమ్మర్ పల్లి :అమృత్ తెలంగాణ: మండలంలోని కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరైన విద్యార్థులకు ఈ ప్రోత్సాహక బహుమతులను అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్ తెలిపారు. జూన్ నెలలో 14 రోజులు పాఠశాల నడవగా 14 రోజులు పాఠశాలకు హాజరైన 6, 7, 8, 9, 10 తరగతి లకు చెందిన విద్యార్థులకు ఈ ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు ఆయన తెలిపారు. బహుమతులు పొందిన వారిలో 6వ తరగతిలో జ్వాల రిత్విక, తమ్మిశెట్టి హేమలత, జెట్టి రిశ్వంత్, 7వ తరగతిలో రోస్ నితీష్, 8వ తరగతిలో జెట్టి శ్రీకాంత్, రాధారపు అక్షిత, 9వ తరగతిలో తమ్మిశెట్టి విశ్వతేజ, కోరుట్ల రశ్మిత, శనిగారపు దీక్ష, 10వ తరగతిలో సుందరగిరి చరణ్ తేజ లకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రతినెల పాఠశాలకు 100 శాతం హాజరైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామన్నారు. విద్యార్థులను పాఠశాలకు క్రమం తప్పకుండా రప్పించే కార్యక్రమంలో భాగంగానే ఈ ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడిలో విద్యాసామగ్రి పంపిణీ

ధర్మసాగర్ : అమృత్ తెలంగాణ: మండలంలోని క్యాతంపల్లి,జానకిపురం గ్రామాలలోని మండల పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు విద్యాసామాగ్రిని డాక్టర్ ఎం. ప్రశాంతి, రసాయనశాస్త్రం అసోసియేట్ ప్రొఫెసర్ రెండు పాఠశాలల విద్యార్థులకు నోటుబుక్స్ మరియు పెన్లు విరాళంగా అందించారు.ఈ సందర్భంగా డా. ప్రశాంతి మాట్లాడుతూ చిన్న సహాయాలు కూడా విద్యార్థుల చదువుపై గొప్ప ప్రభావం చూపుతాయని,విద్యకు తోడ్పాటు అందించడాన్ని మన అందరి సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు

# నేటి నుండి డీఏజేజీయూఏ గ్రామ సభలు



అశ్వారావుపేట :అమృత్ తెలంగాణ: సెర్ప్ - డి.ఆర్.డి.ఎ - హెచ్.ఆర్ విభాగం / జిల్లా కలెక్టర్,చైర్మన్, డి.ఆర్.డి.ఎ శాఖాధికారుల ఆదేశానుసారం- గిరిజన గ్రామాల లో ఈనెల 03వ తేదీ నుండి 10 వ తేదీ వరకు "దర్తి అభా జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ (డీఏజేజీయూఏ)" గ్రామ సభలను ప్రతి పంచాయతీలోని ప్రతీ గిరిజన ఆవాసాలలో ప్రధాన మంత్రి జన సురక్ష పథకాల పై (పీఎంఎస్బీవై/పీఎంజేజేవై) గ్రామ సభ్యులకు పూర్తి అవగాహన కల్పిస్తూ ఇన్స్యూరెన్స్ (100%) నమోదు చేయుటకై ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ బుధవారం ప్రకటించారు.

ఐటీడీఏ భద్రాచలం పీఓ రాహుల్ సంబంధిత అధికారులతో ఐ.డి.ఓ.సి పాల్వంచ లో గత నెల 30 వ తేదీలో జరిగిన సమావేశంలో వై సూచిక అనుసరించి, జిల్లా లోని (19) ఆదివాసి గిరిజన మండలాల లోని (10) గ్రామ పంచాయతీలలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన దర్తి ఆభా జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ (డీఏజేజీయూఏ)" గ్రామ సభలు క్షేత్రస్థాయిలో 03 వ తేదీ నుండి 10 వరకు నిర్వహించవలసినదిగా ఆదేశాలు జారీ చేసారని తెలిపారు.

ఈ గ్రామ సభల్లో ప్రతి గ్రామ పంచాయతీ నందు ప్రధానమంత్రి జవ మరక్ష పథకాలపై (పీఎంఎస్బీవై /పీఎంజేజేబీవై ) గ్రామ సభ్యులకు పూర్తి అవగాహన కల్పిస్తూ ఇన్సూరెన్స్ నమోదు చెయాలని తెలిపారు.

1) పీఎంఎస్బీవై: ఈ స్కీమ్ నందు 18 -70 సంవత్సరం లోపు గలవారు అర్హులు. ప్రీమియం రూ.29/-సంవత్సరానికి మరియు భీమా కవరేజీ- రూ.2.00 లక్షలు.

2) పీఎంజేజేబీవై: ఈ స్కీమ్ నందు 18 -50 సంవత్సరం లోపు గలవారు అర్హులు ప్రీమియం రూ.436/-సంవత్సరానికి మరియు భీమా కవరిజి- రూ.2.00 లక్షలు (100% రిజిస్ట్రేషన్)

కావున సంబంధిత ఏ.పి.యులు, సి.పిలు, గ్రామ దీపికలు, సంబంధిత బ్యాంక్ బ్రాంచ్ కస్టమర్ సర్వీస్ ప్రొవైడర్స్ (సి.ఎస్.పిలు), స్త్రీనిధి వి.ఎల్.ఇ లు, ఫైనాన్సియల్ లీటరపి కోఆర్డినేటర్లు బిజివెస్ కరస్పాండెంట్లు(బి.ఏ లు) మరియు గ్రామ పంచాయతీ సెక్రటరీ లు పూర్తి భాధ్యతలను తీసుకొని గ్రామ సభలను విజయవంతం చేయాలని ఆదేశాలు జారీ చేసారన్నారు.


అశ్వారావుపేట నియోజక వర్గం అన్నపు రెడ్డి పల్లి అన్నదేవం లో, తేదీ,అశ్వారావుపేట మండలం అనంతారం,ఆసుపాక,బచ్చువారిగూడెం,జమ్మి గూడెం 3 వ తేదీన, కన్నాయిగూడెం,కావడి గుండ్ల లో 4 వ తేదీ,కొత్తమామిళ్ళవారిగూడెం లో 5 తేదీ,నందిపాడు పంచాయితీల్లో 7 తేదీన గ్రామసభలు నిర్వహించాలని తెలిపారు.

# బాధిత కుటుంబానికి ఎల్ఓసి అందజేత



ఆర్మూర్ :అమృత్ తెలంగాణ: మండలంలోని ఇస్సపల్లి గ్రామానికి చెందిన శెట్టిపల్లి ముత్తన్న ఇటీవలే అనారోగ్యంతో బాధపడుతూ సర్జరీ కోసం నిమ్స్ హాస్పిటల్ లో జాయిన్ అయ్యారు. కాంగ్రెస్ నాయకులు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి విన్నవించడంతో వారు స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్ ఓ సి ద్వారా రూ.2,50,000/- కాపీ వారి కుటుంబ సభ్యులకు బుధవారం అందజేసినారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి కి వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినారు.

# ప్రభుత్వ సాయంతో స్వదేశానికి వచ్చిన మృతదేహం



కమ్మర్ పల్లి :అమృత్ తెలంగాణ: మండలంలోని హాస కొత్తూర్ గ్రామానికి చెందిన జుంబరత్ అన్వేష్ మృతదేహం బుధవారం సాయంత్రం స్వగ్రామానికి చేరింది. బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశమైన ఒమన్ వెళ్లిన అన్వేష్ 15 రోజుల క్రితం అక్కడే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అన్వేష్ మృతదేహాన్ని స్వగ్రామం రప్పించేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నించిన కంపెనీ వారు స్పందించకపోవడంతో 15రోజుల నుండి చాలా యిబ్బందిపడ్డారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, ముత్యాల సునీల్ రెడ్డిలు ప్రభుత్వం ద్వారా గల్ఫ్ కన్వీనర్ బీంరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వారు స్పందించి మన దేశం ఎంబసీతో మాట్లాడి మృతదేహం త్వరగా రావడానికి కృషి చేశారు. దీంతో బుధవారం ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్టుకు అన్వేష్ మృతదేహం చేరుకుంది. మృతదేహాన్ని విమానాశ్రయం నుండి ప్రభుత్వం తరఫున ఎటువంటి ఖర్చులు లేకుండా అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేసి మృతుడి స్వగ్రామం హస కొత్తూర్ కు సాయంత్రం తీసుకువచ్చారు. ఒమన్ నుండి అన్వేష్ మృత దేహం ఇంటికి చేరడానికి ప్రభుత్వం చాలా సహాయం చేసిందని పేర్కొంటూ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కుటుంబ తరఫున రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం సాయంత్రం కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య అన్వేష్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశం వెళ్లిన అన్వేష్ శవమై స్వగ్రామం చేరడం గ్రామస్తులను కలిసివేసింది.

# ఇందిరమ్మ ఇళ్లకు రూ.5 లక్షల ఆర్థిక చేయూత



దుబ్బాక : అమృత్ తెలంగాణ: సొంత గూడు లేని పేదలకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కారు రూ.5 లక్షల ఆర్థిక చేయూతనందిస్తూ కొండంత అండగా ఉంటుందని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. బుధవారం దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి, తిమ్మాపూర్, హసన్ మీరాపూర్, పెద్దగుండవెల్లి, మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి, చెల్లాపూర్ వార్డుల్లో, దుబ్బాక మున్సిపల్ కేంద్రంలోని 1, 13, 14, 15, 16, 17, 18, 19 వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆత్మ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, హౌసింగ్ ఏఈ జాహ్నవి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేష్ తో కలిసి ఆయన పనుల్ని ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు సల్కం మల్లేష్ యాదవ్, నరేందర్, మంద శ్రీనివాస్, సాయితేజ గౌడ్, దేవేందర్, పలువురు కార్యకర్తలున్నారు.

# జీవితాన్ని మార్చేది ఆలోచన విధానమే..



దుబ్బాక :అమృత్ తెలంగాణ: నేటి విద్యార్థులు బట్టి చదువులను పక్కన పెట్టాలని, ఆసక్తి ఉన్న సబ్జెక్టులపై పట్టు సాధించి.. జీవితంలో ఆకాశమంత ఎత్తుకు ఎదగాలని, మన ఆలోచన విధానమే జీవితాన్ని మార్చేస్తుందని డీసీపీ మధుకర్ స్వామి అన్నారు. మొబైల్ ఫోన్లకు దూరంగా.. పుస్తకాలకు దగ్గర ఉండాలన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో హైదరాబాద్ పోలీస్ ట్రైనింగ్ కాలేజ్, వాసవి, లయన్స్ క్లబ్ ల సహకారంతో అఖిల రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "వాట్ నెక్స్ట్" అన్న కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దుబ్బాక లో ఎస్ఐ గా జీవితాన్ని ప్రారంభించి నేడు ఎస్పీ స్థాయికి ఎదిగానని, ఈ ప్రాంతాన్ని మరువబోనని స్పష్టం చేశారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న సైబర్ క్రైమ్స్, డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండి జాగ్రత్త వహించాలని సూచించారు. పోలీస్, రైల్వే లలో ఉద్యోగాలు పొందగోరే విద్యార్థులు తమను సంప్రదిస్తే అన్ని తామే ఉచితంగా సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అఖిల రాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఎస్ఐ తౌడ సత్యనారాయణ ను, వాసవి క్లబ్ బాధ్యులు చింతరాజు లను డీసీపీ మధుకర్ స్వామి అభినందించారు. అనంతరం దుబ్బాకలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణతో కలిసి డీసీపీ మధుకర్ స్వామి మొక్కల్ని నాటారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రొఫెసర్లు లక్ష్మీ ప్రసన్న, భవాని, నల్ల నాగరాజు, ఫౌండేషన్ వాలంటీర్లు, కాలేజీ లెక్చరర్లు, పలువురు పాల్గొన్నారు

# పాలనలో కాంగ్రెస్ విఫలం: టీడీపీ నాయకులు స్వామి దొర




అశ్వారావుపేట :అమృత్ తెలంగాణ: కాంగ్రెస్ ఆధ్వర్యంలో, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వం లో ఏర్పడిన ప్రభుత్వం సంవత్సరం ఆరునెలలు అయినా పథకాలను ప్రజలకు చేర్చడంలో పూర్తిగా విఫలం అయిందని తెలంగాణ తెలుగుదేశం పార్టీ అశ్వారావుపేట నియోజక వర్గం నాయకులు కట్రం స్వామి దొర ఆరోపించారు. పార్టీ నియోజక వర్గం స్థాయి సమావేశం బుధవారం అశ్వారావుపేట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రజా పాలన అని చెప్పి అధికారం వచ్చిన తర్వాత సంక్షేమ ఫలాలు ప్రజల వద్దకే అని చెప్పి నేటికి కూడా చేరలేదని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు పేదవాడికి కలగానే మిగిలిపోయేలా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంది అని దుయ్యబట్టారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ను వదిలేసి రాష్ట్రంలో 22 సంవత్సరాల నుండి అధికారంలో లేని తెలుగుదేశం పార్టీని,దాని జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయడు ని టార్గెట్ చేస్తున్న టిఆర్ఎస్ పార్టీ వైఖరి ఏమిటో వారి ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు సమక్షంలో వార్డు నుంచి జెడ్పీటీసీ వరకు రాబోవు స్థానిక ఎన్నికల్లో పోటీ అంశం పై చర్చించినట్లు ఆయన తెలిపారు.

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు గాలికి వదిలేసిన కాంగ్రెస్ నాయకులు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మీద,బనకచర్ల ప్రాజెక్టు గురించీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం స్పష్టత లేని విధంగా మాట్లాడటం చాలా దురదృష్టకరం అన్నారు. సముద్రంలోకి వృధాగా పోయే నీటిని మాత్రమే నిలువ చేసుకుంటామని ముఖ్యమంత్రి అంటుంటే సగం తెలిసి సగం తెలియని కాంగ్రెస్ నాయకులు కొందరు వ్యంగ్యంగా మాట్లాడుతూ మరలా బాబు తెలంగాణ కు ఎలా వస్తారు అని మాట్లాడటం బాధాకరం అన్నారు తెలుగుదేశం పార్టీ తెలంగాణలో తిరిగి జండా ఎగుర వేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట, దమ్మపేట,ములకలపల్లి,అన్నపు రెడ్డి పల్లి,చంద్రుగొండ అద్యక్షులు నార్లపాటి శ్రీనివాసరావు,వలీ పాషా, తేల్ల చిన్నయ్య, పానుగంటి రామారావు, వారధి సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ సమావేశంలో మండలాల అద్యక్షులు వారధి సత్యనారాయణ, దమ్మపేట పీఏసీఎస్( సొసైటీ) మాజీ వైస్ చైర్మన్ కట్నం ఎర్రప్ప, అశ్వారావుపేట పట్టణ అధ్యక్షులు అంకోలు వెంకటేశ్వరరావు, తెలుగు యువత నాయకులు బొడ్డపాటి ఉదయ్ కుమార్ లు పాల్గొన్నారు.

# పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించింది: ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్




అశ్వారావుపేటఅమృత్ తెలంగాణ: పంచాయతీ కార్యదర్శులు ఎవరూ ఎంపీడీఓ అనుమతి లేకుండా మండలం వదిలిపెట్టి వెళ్ళకూడదని, అనుమతి లేకుండా ఎవరైనా వెళ్తే వారు తదుపరి రోజున జిల్లా పంచాయతీ అధికారికి, డివిజన్ పంచాయతీ అధికారికి రిపోర్ట్ చేసి సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుంది అని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం పనులను, ఆసుపత్రులను పర్యవేక్షించారు.ఆరోగ్య అత్యవసర పరిస్థితులు ఆసన్నం అయినందున ఎవరూ పంచాయితీ ని విడిచి వెళ్ళ రాదని డీపీఓ చంద్రమౌళి ఆదేశించారని తెలిపారు. కావున అట్టి పరిస్థితులను తీసుకొని రావద్దు అని, గ్రామ పంచాయతీలలో ముమ్మరంగా శానిటేషన్ పనులు చేయించి ఫాగింగ్ మిషన్ ద్వారా దోమల నివారణకు చర్యలు తీసుకుని,పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయవలసిందిగా,నీరు సరఫరా అయ్యే దగ్గర ఎక్కడ కలుషితం కాకుండా చూడాలని,రోడ్డుకు ఇరు పక్కల సీసాలు,ప్లాస్టిక్ వస్తువులు ఏమీ ఉండకుండా చూడాలని, వాటిని డంపింగ్ యార్డ్ కి చేర్చి సెగ్గేషన్ చేయాల్సిందిగా ఆదేశించారు.

# డాక్టర్ పారిజాతకు సన్మానం..




భువనగిరి :అమృత్ తెలంగాణ: డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్ పారిజాతను జిల్లా కేంద్రంలోని రామ్ నగర్ లో రాంనగర్ వాకింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాంనగర్ వాకింగ్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. నిరుపేదలకు తక్కువ ఫీజుతో వైద్యం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ వాకింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు చింతెక్కింది కృష్ణమూర్తి, గునుగుంట్ల శ్రీనివాస్ గౌడ్, తాడం రాజశేఖర్, అధ్యక్షులు రేణిగుంట్ల విట్టల్, మల్లికార్జున చారి, చామల వెంకటనారాయణ రెడ్డి, రాచర్ల వెంకటేశం, కీసరి ఉపేందర్ రెడ్డి , మందడి జనార్దన్ రెడ్డి, గోదా శ్రీనివాస్ గౌడ్, సావన్ కార్ వెంకటేశం, కొండ శ్రీనివాస్, నరేష్, శ్రీశైలం, రాధాకృష్ణ, బుర్ర కిష్టయ్యలు పాల్గొన్నారు.

# గుంతలమయంగా జాతీయ రహదారి



భువనగిరి :అమృత్ తెలంగాణ: భువనగిరి జిల్లా కేంద్రం నుంచి హనుమాపురం వెళ్లే రహదారి గుంతలమయం కావడంతో ఆ మార్గం గుండా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్డిఓ ఆఫీస్ పక్కన ఆర్ఓబి బ్రిడ్జి , ఆర్కే హాస్పిటల్ ముందట గుంతలు ఉండడంతో వాహనదారులు ఆ మార్గం గుండా ప్రయాణించాలంటే భయపడుతున్న పరిస్థితి నెలకొంది. ఇటీవల కాలంలో ప్రమాదాలు చాలావరకు జరిగిన సందర్భాలు ఉన్నాయి. ఇటీవల కాలంలో ఎమ్మెల్యే రోడ్డును సందర్శించి, పనులు ప్రారంభిస్తానని చెప్పినా, పనులు ప్రారంభం కాలేకపోవడంతో అధికారులు స్పందించాలని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు , స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వెంటనే రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలి: ములాయం సింగ్ యాదవ్ యూత్ బ్రిగేడ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మేకల బాలు విజయవాడ జాతీయ రహదారి నుంచి చిట్యాల మీదుగా భువనగిరి జిల్లా కేంద్రం నుంచి సిద్దిపేటకి వెళ్లడానికి నేషనల్ పర్మిట్ గల లారీలు ఎక్కువగా ఈ మార్గంలో ప్రయాణిస్తుంటాయి. చిన్న గుంత పడితే వాహనాలు వెళ్లడంతో పెద్దపెద్ద గుంతలుగా మారి వర్షాలు పడినప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే అధికారులు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే స్పందించాలని కోరారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో సమీక్ష సమావేశం



తుర్కపల్లి :అమృత్ తెలంగాణ: మండలం వాసాలమర్రి గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ దేశ నాయక్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు త్వరగా ముగ్గులు పోసుకొని ఇండ్లను నిర్మించుకోవాలని అన్నారు. మేస్త్రీలు మార్కెట్ ధర కంటే ఎక్కువగా లబ్ధిదారుల నుండి వసూలు చేయకూడదని ఒకవేళ వసూలు చేసినట్లయితే చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వం ఆదేశించిన కొలతల ప్రకారం బేస్మెంట్ 400 నుండి 600 అడుగుల వరకు మాత్రమే, 12 ఎం ఎం స్టీల్ రాడ్లను మాత్రమే పిల్లర్ నిర్మించుకోవాలని అన్నారు. లబ్ధిదారులకు ఇసుక కోసం ఇబ్బందులు పడవద్దని మండలంలో కాకుండా పక్క మండలంలో ఉన్న వాగులో నుండి ఇసుక రవాణాకు అనుమతిని ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇండ్ల నిర్మాణానికి సిమెంటుకలను వాడుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, హౌసింగ్ డిఇ శ్రీరాములు, హౌసింగ్ ఏఈ స్వర్ణ, పంచాయితీ కార్యదర్శి ఒగ్గు మధు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కస్తూర్బా స్కూల్ ను తనిఖీ చేసిన ఎంఈఓ



పెద్దవూర :అమృత్ తెలంగాణ: పెద్దవూర మండల కేంద్రం లోని కస్తూర్బా గాంధీపాఠశాల ను మండల విద్యాధికారి తరి రాము బుధవారం అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్లో సుమారు నలభై నిమిషాల పాటుకలియ తిరుగుతూ అన్ని వివరాలను ఎస్ ఓను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు ఉపాధ్యాయులు చేస్తున్న బోధనా తీరును క్లాస్ రూమ్ లో విద్యార్థులతో పాటు కూర్చొని పరిశీలించారు.విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే స్టోర్ రూమ్, కిచెన్ ,టాయిలెట్స్, వంట పాత్రలు ,కూరగాయలను రికార్డులు పరిశీలించి తగుచూచనలు చేశారు.విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.వర్షాకాలం సీజనల్ వ్యాదులుసోకకుండా పాఠశాల పరిసరాలు, తరగతి గదులు,వంటగది పరిశుభ్రంగా వుంచు కోవాలని తెలిపారు

# సిగాచి ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి: సీపీఐ(ఎం)




భువనగిరి : అమృత్ తెలంగాణ: సంగారెడ్డి జిల్లా పాశ మైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన భారీ విస్పోటం బాధాకరమని, పూర్తిస్థాయిలో విచారణ జరపాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య డిమాండ్ చేశారు. బుధవారం భువనగిరి సుందరయ్య భవన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ సమక్షంలో ఆయన మాట్లాడారు. ప్రమాదానికి కారణం యాజమాన్యాల లోపమేనని తెలిపారు.

మృతులలో అధిక భాగం ఒడిస్సా, బీహార్, చత్తీస్గడ్, ఆంధ్ర ప్రదేశ్, మధ్యప్రదేశ్ నుండి వచ్చిన వలస కార్మికులు ఉన్నారని తెలిపారు. వారి కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ప్రభుత్వమే చెల్లించాలని అన్నారు. పొట్టకూటి కోసం వలసొచ్చి పనిచేస్తున్న కార్మికులు శవాలుగా మారుతుంటే యాజమాన్యాలకు మద్దతు తెలిపేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు తేవడం బాధాకరమన్నారు. ఇలాంటి ప్రమాదాలు జరగడం మొదటిది కాదని పేర్కొన్నారు. ప్రమాదం జరిగినప్పుడు ఆందోళన చేయడం, కనుమరుగు కావడం జరుగుతుందన్నారు.

ఈ ఘటనలో 48 మృతదేహాలు బయటపడ్డాయని, మరో తొమ్మిది మంది ఆచూకీ లేదన్నారు. దీనిపై దేశ ప్రధాని మోడీ స్పందించడం సంతోషకరమన్నారు. మృతులకు రూ.2 లక్షలే ప్రకటించడం మొసలి కన్నీరే అవుతుందన్నారు. మృతులకు రూ.2 లక్షలు బిచ్చం వేస్తున్నారా అని ప్రశ్నించారు. సిగాచి ఘటనను మోడీ దృష్టికి తీసుకుపోయామని కిషన్ రెడ్డి ప్రకటించడం హాస్యాస్పదం అన్నారు. దేశంలో మహిళలపై దాడులు, సామూహిక లైంగికదాడులు, హత్యలు జరుగుతుంటే నోరు విప్పని ప్రధాని మోడీ తెలంగాణలో రాజకీయ నాటకాల కోసం నోరు విప్పాడని ఎద్దేవా చేశారు. అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టం 1979 కార్మికుల సంక్షేమం పని ప్రదేశాలలో వారి రక్షణ కోసం ఉద్దేశించి బడిందన్నారు.

అలాంటి చట్టం అమలు చేస్తే కార్మికులకు భద్రత హక్కులు కల్పించబడతాయన్నారు. దేశంలో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసిందని, ఆ రద్దు చేసిన చట్టాలలో అంతరాష్ట్ర వలస కార్మికుల చట్టం ఉందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా సంఘటన స్థలానికి వచ్చి పరిస్థితులను పరిశీలించడం, ఒక్కొక్క మృతునికి రూ.1 కోటి ప్రకటించడం అభినందనీయమన్నారు. ఆ ఎక్స్రగ్రేషియాను యాజమాన్యాలు చెల్లిస్తాయని తెలపడం హాస్యాస్పదమన్నారు. ఇంత పెద్ద ఎత్తున సంఘటన జరిగి వలస కార్మికులతో పాటు జనరల్ మేనేజర్ స్థాయి అధికారి మృతి చెందినా.. నేటికీ ఎండి సంఘటన స్థలానికి రాలేదన్నారు.యాజమాన్యం తగిన రీతిలో స్పందించలేదన్నారు. ఇలాంటి యాజమాన్యాలు కార్మికులకు ఎక్స్ గ్రేషియా రూ.1 కోటి ఇస్తుందని ఎలా నమ్మాలని ప్రశ్నించారు. ప్రభుత్వమే మృతుల కుటుంబాలకు ఆ కోటి రూపాయల చొప్పున చెల్లించి యాజమాన్యం నుండి వసూలు చేసుకోవాలని సూచించారు. తీవ్రమైన గాయాలతో పని చేయలేని పరిస్థితిలో ఉన్న క్షతగాత్రులకు రూ. 10 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం సమంజసంగా లేదన్నారు. కనీసం వారికి రూ. 50 లక్షలు ప్రకటించాలన్నారు. కంపెనీలో తయారయ్యే వస్తువులు, పదార్థాలపై సాంకేతిక నిపుణులైన వారితో పనిచేయించాలన్నారు. పొట్టకూటి కోసం వచ్చిన కార్మికులతో పనిచేయడంతో ఇంత పెద్ద ఎత్తున ప్రమాదం జరిగిందన్నారు. ప్రభుత్వ అధికారులు యాజమాన్యాలు కుమ్మక్కు కావడంతోటే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కాళేశ్వరంపై విచారణ జరపాలి: ఇతర ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలి

కాళేశ్వరం ప్రాజెక్టుపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, ఈ విషయాన్ని ప్రతి రోజు ప్రస్తావించడం సరైనది కాదన్నారు. ఒకే ప్రాజెక్టు మీద రూ1.20 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టడం, అందులో అవినీతి జరగడం, అధిక మొత్తంలో బుగ్గిపాలు కావడం జరిగిందన్నారు. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే మధ్యతరగతి, చిన్న నీటి ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చి భూములను సస్యశ్యామలం చేయాలన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తి చేస్తే ప్రాజెక్టు కింద భూములు తూర్పుగోదావరి జిల్లాలో ఉండే పచ్చదనం పంటలతో నిండిపోతాయన్నారు. మూసి పూర్తి విషపూరితమైన నీటీ ప్రవాహం అని పేర్కొన్నారు.అ నీరు వ్యవసాయానికి, త్రాగునీరుకు ఉపయోగపడదన్నారు. సుమారు రూ.360 కోట్లతో బస్వాపురం ప్రాజెక్టు పూర్తి చేస్తే, మూసి నీరు లేకుండానే వ్యవసాయం ఈ ప్రాంతంలో చేయవచ్చన్నారు. పాలమూరు – రంగారెడ్డి లిఫ్ట్ పనులు చేపట్టాలన్నారు. గోదావరి, కృష్ణా జలాలను మూసిలోకి తరలించాలన్నారు. మూసి ప్రవహించే కాలువల వద్ద నీటి శుద్ధి ప్లాంట్లను అత్యాధునిక సాంకేతికంతో నిర్మించాలన్నారు. చిన్న నీటి ప్రాజెక్టులను పట్టించుకోవాలన్నారు. మూసి ప్రక్షాళన చేసిన తర్వాత, పరివాహక ప్రాంతాల వారికి నష్టం చేకూర్చకుండా పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దితే, తమకు ప్రజలకు అభ్యంతరం లేదన్నారు. మూసి ప్రక్షాళన పేరుతో సీఎం రేవంత్ రియల్ ఎస్టేట్ యాజమాన్యాలకు, కార్పొరేట్ శక్తుల పొట్టలు నింపడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు.

ప్రజలకు, రైతులకు ఉపయోగపడకుండా బాధ్యతారహితంగా వ్యవహరిస్తే, ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. బనకచర్ల నీటిని రెండు రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించి, వాటాలు పంచుకోవాలన్నారు. నేటికీ తెలంగాణ ప్రభుత్వం నికరజలాలను వాడుకోలేకపోతోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎలాంటి అనుమతులు లేకుండా ఏకపక్షంగా పోతే తెలంగాణకు నష్టం జరుగుతుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జల్లెల పెంటయ్య పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి: ఎంపీడీఓ




జన్నారం :అమృత్ తెలంగాణ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని జన్నారం ఎంపీడీఓ ఉమర్ షరీఫ్ సూచించారు. బుధవారం ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు వండుతున్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఓ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదం జరిగేదాకా పట్టించుకోరా..



జన్నారం : అమృత్ తెలంగాణ: జన్నారం మండలం సింగరాయపేటకు వెళ్లే ప్రధాన విద్యుత్ లైన్ స్తంభాలు వంగిపోయి ప్రమాదకరంగా మారాయని రైతు పోచయ్య వాపోయారు. గాలివాన వస్తే పడిపోయి ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యుత్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. స్తంభాలు కిందపడక ముందే సరిచేయాలని పేర్కొన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.

# ఎల్ఐసీని బలోపేతం చేసుకుందాం

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: సంస్థ ప్రగతితోనే ఉద్యోగుల భవిష్యత్తు అన్న దాన్ని గుర్తించి ఎల్ఐసీ బలోపేతం కోసం అందులోని ఉద్యోగులందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐఐఈఏ) ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను అడ్డుకునే పోరాటాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లను వెనక్కి తీసుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల హక్కుల కోసం విశాల ఐక్యవేదికగా పోరాటాలు నిర్వహించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు.

# మాజీ సర్పంచ్ తండ్రి మృతి పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



రామగిరి : అమృత్ తెలంగాణ: రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ తండ్రి ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయ్ కొండు సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు.బుధవారం ఆమె కుటుంబ సభ్యులను మంథని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ పరామర్శించారు. ఆమె కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.మాజీ ఎమ్మెల్యేవెంట పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ రఘువీర్ సింగ్, కరీంనగర్ మాజీ కార్పొరేటర్ తాటి ప్రభావతి మనోహర్, పివి రావు, మాజీ వార్డ్ సభ్యులు తన్నీరు ప్రదీప్,కొండు వేణుమాధవ్,కొండు ప్రతాప్, వేణు ఉన్నారు

# గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవు




తంగళ్ళపల్లి :అమృత్ తెలంగాణ: గ్రామాల్లో ఎవరైనా సరే నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఉపేందర్ చారి బెల్ట్ షాప్ నిర్వాహకులను హెచ్చరించారు. మండలంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న నిర్వాహకులకు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై ఉపేందర్ చారి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే వారిని ఎమ్మార్వో ముందు బైండ్ డోర్ చేయడం జరుగుతుందన్నారు.అలాగే కఠినమైన చర్యలు తప్పవు అన్నారు. బెల్ట్ షాపులను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించడం వల్ల గ్రామాలలో రోడ్డు ప్రమాదాలు, గొడవలు, కొట్లాటలు జరిగి శాంతి భద్రతలకు విఘాతం కలుగుతున్నాయి అన్నారు. వాటన్నిటిని దృష్టి ఉంచుకొని బెల్ట్ షాప్ నిర్వాహకులు బెల్ట్ షాపులను నిర్వహించకూడదని ఎస్సై హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా సరే నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఉపేందర్ చారి బెల్ట్ షాప్ నిర్వాహకులను హెచ్చరించారు. మండలంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న నిర్వాహకులకు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై ఉపేందర్ చారి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే వారిని ఎమ్మార్వో ముందు బైండ్ డోర్ చేయడం జరుగుతుందన్నారు.

అలాగే కఠినమైన చర్యలు తప్పవు అన్నారు. బెల్ట్ షాపులను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించడం వల్ల గ్రామాలలో రోడ్డు ప్రమాదాలు, గొడవలు, కొట్లాటలు జరిగి శాంతి భద్రతలకు విఘాతం కలుగుతున్నాయి అన్నారు. వాటన్నిటిని దృష్టి ఉంచుకొని బెల్ట్ షాప్ నిర్వాహకులు బెల్ట్ షాపులను నిర్వహించకూడదని ఎస్సై హెచ్చరించారు.

# మున్సిపల్ ఏఈగా శ్రీనాథ్ బాధ్యతలు

దుబ్బాక: అమృత్ తెలంగాణ: దుబ్బాక మున్సిపాలిటీ నూతన ఏఈ గా వీ.శ్రీనాథ్ బుధవారం బాధ్యతల్ని స్వీకరించారు. సిద్దిపేట మున్సిపాలిటీ నుంచి దుబ్బాకకు ఇంచార్జిగా వచ్చారు. ఇదివరకు ఇక్కడ ఏఈ గా పనిచేసిన శ్రీకాంత్.. ప్రస్తుతం సంగారెడ్డి మున్సిపాలిటీ కి పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఇద్దరు ఏఈ లను మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, సీనియర్ అకౌంటెంట్ అనిల్ రెడ్డి, సిబ్బంది శ్రీకాంత్, మధుసూదన్, కల్పన, మేఘమాల, సంధ్య పలువురున్నారు.

# తెలంగాణలో పెద్ద కాంట్రాక్టులన్నీ చంద్రబాబు కోవర్టులకే: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



జడ్చర్ల అమృత్ తెలంగాణ: తెలంగాణ ప్రాంతానికి శాపంగా మారనున్న ఏపీ బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాలంటే లేఖలు రాసినంతమాత్రాన సరిపోదని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. తెలంగాణలో ఉన్న చంద్రబాబు కోవర్టులను టైట్ చేస్తేనే ఆ ప్రాజెక్టు ఆగే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. బాలానగర్ మండలం మోతీఘనపూర్ గ్రామంలో బుధవారం ముడా నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలకు శంఖుస్థాపన చేసారు. ఈ సందర్భంగానే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ.. ఏపీ సీఎం చంద్రబాబు కోవర్టులు ఈరోజు తెలంగాణలో ఉన్నారని , తెలంగాణలో పెద్ద కాంట్రాక్టులన్నీ వాళ్లే చేస్తున్నారని అన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాలు, రోడ్డు కాంట్రాక్టులు, హైదరాబాద్ లో దందాలు కూడా వాళ్లే చేస్తున్నారని తెలిపారు. " ఆ కోవర్టులకు మొత్తం నల్లా కలెక్షన్లు కట్ చేయండి, కరెంటు కనెక్షన్లు కట్ చేయండి, ఇరిగేషన్ ప్రాజెక్టులలో ఒక్క రుపాయి లేకుండా వాళ్లను కట్ చేయండి.." అని సూచించారు. అప్పుడు వాళ్లే వెళ్లి చంద్రబాబు కాళ్లు పట్టుకొని బనకచర్ల బంద్ చేయిస్తారని అనిరుధ్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మంచిగ చెబితే ఆంధ్రోళ్లు వినరని, ఈ పని చేస్తే వారం రోజుల్లో బనకచర్ల బంద్ అవుతుందని చెప్పారు. తాను చేస్తున్న సూచనను గమనించాలని మంత్రి ఉత్తమ్ ను కోరారు. మేము చేసిన అభివృద్ధికి మోతీఘనపూర్ గ్రామమే సాక్ష్యం: గత పది ఏళ్లలో మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మీ గ్రామానికి ఏం చేసారో ప్రజలు ఆలోచించుకోవాలని అనిరుధ్ రెడ్డి ఈ సందర్భంగా మోతీఘనపూర్ గ్రామస్తులను కోరారు. మోతీఘనపూర్ ను అభివృద్ధి చేయకపోగా ఈ గ్రామానికి రావాల్సిన రూ. 4.50 కోట్ల ముడా నిధులు మహబూబ్ నగర్ కు మళ్లించారని విమర్శించారు. తనకు మోతీఘనపూర్ గ్రామంతో అనుబంధం ఉందని, అందుకే అభివృద్ధి పనుల్లో ఈ గ్రామానికి ప్రాధాన్యత ఇస్తున్నానని తెలిపారు. అందులో భాగంగానే ఈ రూ. 50 లక్షల నిధులు సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజ్ కోసం మంజూరు చేశామన్నారు. ఇప్పటివరకు గ్రామంలో రూ. 3 కోట్ల రైతు రుణమాఫీ ఇచ్చామని తెలిపారు. గత ప్రభుత్వ 10 ఏళ్లలో ఒక్క ఇళ్లయినా, రేషన్ కార్డు అయినా ఇచ్చారా? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో 28 ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేసామని, 157 కొత్త రేషన్ కార్డులు కూడా మంజూరయ్యానీ వెల్లడించారు. సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా రూ. 15 లక్షలు, పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి ఇచ్చామని గుర్తు చేశారు. మోతీఘనపూర్ గ్రామాన్ని చూస్తే పదేళ్లలో లక్ష్మారెడ్డి చూపిన నిర్లక్ష్యం, తాను సంవత్సరం కాలంలో నేను చేసిన అభివృద్ధి ఏమిటో అర్థమౌతుందని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా అనిరుధ్ రెడ్డి హామీ ఇచ్చారు.

# బాధిత కుటుంబానికి స్నేహితుల ఆర్థిక సాయం



జడ్చర్ల: అమృత్ తెలంగాణ: ప్రస్తుత సమాజంలో అన్న, తమ్ముడు, అక్క, చెల్లి రక్త సంబంధాలు ఉన్నవాళ్లు కూడా ఆపదలో ఉంటే చూసి నవ్వుకునే వారే కానీ సహాయం చేయడానికి ఎవరు ముందుకు వచ్చే పరిస్థితి లేదు. అలాంటి ఈ రోజుల్లో రాయికల్ గ్రామానికి చెందిన రాఘవేందర్ రెడ్డి పది రోజుల క్రితం అకస్మాత్తుగా చనిపోయారు. ఈ నేపథ్యంలో రాఘవేందర్ రెడ్డి కుటుంబాన్ని 1993 పదవ తరగతి బ్యాచ్ మిత్రులు కిష్టారం గోపాల్ రెడ్డి, పోలేపల్లి బాలసామి గౌడ్, ఆర్టీసీ రవి, దేవేందర్, రాయపల్లి రాంరెడ్డి, నర్సింలు గౌడ్, సత్యనారాయణ, ప్రవీణ్ కుమార్, మాచారం వెంకట్రెడ్డి, వారి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వారి కుటుంబ పరిస్థిని గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమవంతు సహాయంగా రూ. 46 వేలను కుటుంబానికి అందజేశారు. అంతే కాకుండా భవిష్యత్తులో పిల్లల చదువులకు ఏమైనా ఆర్థిక సహాయం అవసరం అయితే మా యొక్క మిత్రబృందం తరపున సహాయం అందిస్తామని హామీ ఇచ్చి కుటుంబానికి ధైర్యం చెప్పారు.

రాఘువేందర్ రెడ్డి చాలా మంచివాడు, అందరితో కలిసిమెలిసి ఉండేవాడని నాటి జ్ఞాపకాలను మరోసారి నెమరువేసుకున్నారు.

# బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధులు విడుదల చేయాలని మంత్రికి వినతి



భువనగిరి:అమృత్ తెలంగాణ: జిల్లాలోని ఎస్సీ ప్రభుత్వ విద్యార్థినుల వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపర్చేందుకు నూతన భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ని భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ కలిసి వినతిపత్రం అందజేశారు. బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమానికి వెళ్తూ యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామి దర్శనానికి వచ్చిన మంత్రి లక్ష్మణ్ ని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. భువనగిరి జిల్లా కేంద్రంలోని బెస్ట్ అవైలబుల్(బాస్) స్కీమ్ కింద ప్రైవేట్ స్కూలులో చదువుతున్న విద్యార్థులకు ఇవ్వవలసిన నిధులు గత ప్రభుత్వంలో పెండింగ్లో ఉన్నాయి. స్కూల్ యాజమాన్యాలు వాళ్ళు ఆర్థిక భారం మోయలేక ఎస్సీ విద్యార్థులకు ఆర్థిక భారంతో యూనిఫామ్ లు, బుక్స్, ఫీజులు, చెల్లించాలని విద్యార్థులపై వారి తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకొస్తున్నందున తక్షణమే బెస్ట్ అవైలబుల్ (బాస్) నిధులను విడుదల చేయాలని, ఎస్సీ బాలికల వసతి గృహాలలో ఉన్న సమస్యలను వివరించారు. ఎస్సీ విద్యార్థుల పోస్టుమట్రిక్ స్కాలర్షిప్లను సైతం విడుదల చేయాలని అలాగే ఎస్సీ కులాంతర వివాహం చేసుకున్న వివాహితులకు రావలసిన ప్రోత్సహకం నిధులు లేక ఆగిపోయినందున వెంటనే వాటిపై దృష్టి సారించి నిధులను విడుదల చేయాలని మంత్రిని కోరారు. భువనగిరిజిల్లా కేంద్రంలో ఎస్సీ బాలికలవసతి గృహం నిర్మించేందుకు నిధులను విడుదల చేసి విద్యార్థుల సంఖ్యకు తగినన్ని గదులను అందుబాటులోకి తేవాలన్నారు. ప్రస్తుతం ఉన్న వసతి గృహాలలో సరైన సదుపాయాలు లేనందువల్ల విద్యార్థినులు అసౌకర్యానికి గురవుతున్నారని వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సంబంధించిన అధికారులతో సమీక్ష నిర్వహించి వెంటనే కావలసిన నిధులను విడుదల చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# నూతన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ కు శుభాకాంక్షలు..



సూర్యాపేట:అమృత్ తెలంగాణ: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని హాస్టల్ లో చదివే ప్రతి విద్యార్థి రక్షణ మన బాధ్యత అని బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నిద్ర సంపత్ నాయుడు అన్నారు. బుధవారం కలెక్టరేట్ లో బీసీ సంక్షేమ కార్యాలయంలో జిల్లాకి కేటాయించిన నూతన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లని శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు హాస్టల్ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగాకుండా చూసుకోవాలని అన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని తెలిపారు. తల్లిదండ్రులు ఏ నమ్మకంతో విద్యార్థులను హాస్టల్లో వదిలినారో వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది వారిని కంటికి రెప్పలా చూసుకోవాలి అని ఆయన తెలిపారు. నూతనంగా ఎంపికైన హాస్టల్ వెల్ఫేర్ అధికారులు మంచిగా పని చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ హాట్ లో నేహాశర్మ కైపెక్కిస్తుందే!



నేహా శర్మ అందాల సరాగాల గురించి చెప్పాల్సిన పనిలేదు. బ్యూటీ సామాజిక మాధ్యమాల్లో వెల్లువలా విరుచుకుపడుతుంది. ఇన్ స్టాగ్రామ్.. ట్విట్టర్ వంటి మాధ్యమాల్లో రెగ్యులర్ గా టచ్ లో ఉంటోంది. నిరంతర ఫోటోషూట్లతో సెల్ఫీ షూట్లతో హీటెక్కిస్తుంటుంది. గడిపేస్తోంది. యూత్లో ఎప్పటికప్పుడుడు చర్చకొస్తుంటుంది. రేర్ గా సిస్టర్ ఐశాశర్మతోనూ ఫోటో సెషన్స్ లో పాల్గొంటోంది. అక్కా-చెల్లి ఇద్దరు కలిసి అందాల దాడికి దిగారంటే? ఆ కథ వేరుగా ఉంటుంది. అయితే ఈసారి అంతటి సాహసానికి పూనుకోలేదు. నేహా శర్మ సోలోగానే అందాల విందు చేసింది. ఇదిగో ఇక్కడిలా ఆరెంజ్ రంగు ఫ్లోరల్ దుస్తుల్లో అందాల ఆరబోతే పనిగా పెట్టుకుంది. క్లీవేజ్ షో సహా థైషో ఆద్యంతం కుర్రాళ్లలో సలపరం పుట్టిస్తుంది. సోఫాపై సగం మడిచిన కాలితో కాకలు రేపుతోంది. విరహవేదన భంగిమలో ఆద్యంతం ఆకట్టుకుంటుంది. షోల్డర్ లెస్ ఫ్లోరల్ క్యాజువల్స్ లో నేహా ఆహా అనిపిస్తుంది. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. నేహాశర్మ అభిమానులు ఆద్యంతం ఆసక్తికర కామెంట్లు పోస్ట్ చేస్తూ మరింత హీటెక్కిస్తున్నారు.

# అక్కడా సౌత్ భామలు సత్తా చాటాలంటోన్న రెజీనా!



రెజీనా కసాండ్రా టాలీవుడ్ లో అప్పుడప్పుడు కనిపించినా? కోలీవుడ్ ..బాలీవుడ్ లో మాత్రం బాగానే సినిమాలు చేస్తోంది. రెజీనా కసాండ్రా టాలీవుడ్ లో అప్పుడప్పుడు కనిపించినా? కోలీవుడ్ ..బాలీవుడ్ లో మాత్రం బాగానే సినిమాలు చేస్తోంది. సొంత భాష తమిళం అమ్మడిని బాగా ఆదుకుంది. వచ్చిన అవకాశాల్ని వినియోగిం చుకుని ఖాళీ లేకుండా పనిచేస్తోంది. ఆరేడేళ్లగా బాలీవుడ్ లో నూ సినిమాలు చేస్తోంది. ఇటీవల రిలీజ్ అయిన జాట్ కేసరి చాప్టర్ 2 చిత్రాలతో మంచి విజయాలు అందుకుంది. నటిగా రెజీనా మరింత పరిణతి చెందింది. ఐటం పాటల్లో సైతం అలరిస్తుంది. తాజాగా రెజీనా సౌత్..నార్త్ భామలను ఉద్దేశించి కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలు పంచుకుంది. ఆవేంటో ఆమె మాటల్లోనే. నేను పంజాబీ అమ్మాయి పాత్ర పోషించలేను. పోషించినా అది పరిపూర్ణం కాదు. కానీ ఒక పంజాబీ అమ్మాయి సౌత్ లో ఎలాంటి పాత్ర వచ్చినా పోషించగ లదు. అలాంటి వారిని చాలా క్లోజ్ గా చూసాను. సొంత భాషలో సినిమాలు చేయడం ఏ నటికైనా కంఫర్ట్ గానే ఉంటుంది. కానీ ఒకే భాషకు పరిమితమైతే నటిగా పరిపూర్ణం అయినట్లు కాదు. ఎలాంటి పాత్ర పోషించినా ఆ పాత్ర ప్రభావ వంతంగా ఉండాలి. రెజీనా మంచి పాత్ర పోషించిందని మాట్లాడుకోవాలి. అంత ప్రభావాన్ని చూప గలిగే స్థాయికి చేరుకోవాలనేది నా ఆకాంక్ష. సౌత్ భామలు నార్త్ లో ఎక్కువ సినిమాలు చేయాలని కోరుకుం టున్నాను. అందకు భాష అడ్డంకిగా మారకూడదు. 20 సంవత్స రాలుగా పరిశ్రమలో ఉంటున్నాను. 2018 నుండి హిందీ సినిమాలు చేస్తున్నాను. ఈ ప్రయాణంలో సౌత్ భామలు నార్త్ లో కనిపించింది చాలా తక్కువ.

అక్కడ పరిశ్రమలో మన వాళ్లను చూడాలనుకుంటున్నాను. నేను హిందీలో ప్రావీణ్యం సంపా దించాను. చదవగలను..రాయగలను. కానీ మరింత పర్ఫెక్షన్ కోసం హిందీ ట్యూటర్ కూడా ఉన్నారు. భాషపై ఎంత పట్టుంటే? అంతగా పరిశ్రమలో రాణించగలం అంది.

# అల్లర్ల కేసులో నటి అరెస్ట్... బిగ్ ట్విస్ట్ ఏమిటంటే..?

గత ఏడాది బంగ్లాదేశ్ లో జరిగిన అల్లర్లకు సంబంధించిన కేసులో బంగ్లాదేశ్ నటి నస్రత్ ఫరియాను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. గత ఏడాది విద్యార్థుల ఆందోళనలతో అనూహ్యరీతిలో ప్రధాని పీఠం నుంచి దిగిపోయిన షేక్ హసీనా.. ప్రస్తుతం భారత్ లో తలదాచుకుంటున్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఆమె పార్టీ అవామీలీగ్ మద్దతుదారులైన హిందూ మైనారిటీలు, వారిప్రార్థనా మందిరాలపై పెద్ద ఎత్తున దాడులు జరిగాయి. ఈ క్రమంలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ సమయంలో యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత హసీనాపై హత్య సహా పలు అభియోగాలపై కేసులు నమోదయ్యాయి. నాడు ఆమె బంగ్లా నుంచి పారిపోయి భారత్ వచ్చేశారు. ఈ క్రమంలో ఆమె పార్టీ నేతలతోపాటు, సన్నిహితులపైనా హత్య కేసులు పెట్టారు. ఈ సమయంలో ఆమెబయోపిక్ లో నటించిన నటిపైనా కేసు పెట్టడం గమనార్హం. అవును. గత ఏడాది బంగ్లాదేశ్ లో జరిగిన అల్లర్లకు సంబంధించిన కేసులో బంగ్లాదేశ్ నటి నస్రత్ ఫరియాను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం ఉదయం ఢాకా నుంచి థాయిలాండ్ కు వెళ్తుండగా.. షాజలాల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లోని ఇమ్మిగ్రేషన్ చెక్ పాయింట్ వద్ద ఆమెను అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు! ఈ సందర్భంగా స్పందించిన ఢాకా ఎయిర్ పోర్ట్ ఇమ్మిగ్రేషన్ యూనిట్ వర్గాలు. హసీనా దేశాన్ని వదిలి పారిపోయిన సమయంలో జరిగిన అల్లర్లలో ఆమెపై హత్యాయత్నం కేసు నమోదయ్యిందని, అందులో భాగంగానే అధికారులు ఆమెను కస్టడీలోకి తీసుకున్నారని తెలిపాయి.






నేహామాలిక్ హాట్ ఇన్ వైట్

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309, ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com